ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేది 02.02.2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన నివేదికను ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ మధ్యాహ్నం ప్రభుత్వానికి అందజేస్తారు.
2. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ పట్ల వివక్షకు నిరసనకు కాంగ్రెస్ పార్టీ ఈరోజు హైదరాబాద్ ట్యాంకు బండ్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తోంది.
3. కేంద్ర బడ్జెట్ లో వివిధ పథకాలకు కేటాయింపుల వల్ల తెలంగాణకు కూడా ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.
4. రాష్ట్రంలో ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభమవుతాయి.

**కుటుంబ సర్వే**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయడానికి కీలకమైన సమగ్ర కుటుంబ సర్వే, ఎస్సీ వర్గీకరణపై నివేదికలు సిద్ధమయ్యాయి. కులగణన నివేదికను ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ మధ్యాహ్నం ప్రభుత్వానికి అందజేస్తారు. ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమీషన్ రేపు మంత్రివర్గ ఉపసంఘానికి నివేదికను సమర్పిస్తారు. ఈనెల 5వ తేదిన జరిగే మంత్రి వర్గ సమావేశంలో నివేదికలపై చర్చిస్తారు. అనంతరం అదే రోజున ఏర్పాటు చేసే శాసనసభ ప్రత్యేక సమావేశంలో వాటిని ప్రవేశపెడతారు. కాగా, సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో

బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటైన ప్రత్యేక డెడికేటెడ్ కమీషన్ కూడా రెండు రోజుల్లో తన నివేదికను అందజేస్తుందని భావిస్తున్నారు.

డెస్క్

**బడ్జెట్ కాంగ్రెస్**

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ పట్ల వివక్షపై కాంగ్రెస్ పార్టీ నిరసన బాట పట్టింది. హైదరాబాద్ లో ట్యాంకుబండ్ వద్ద ఈరోజు టిపిసిసి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా ధర్నాలో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. రేపు రాష్ట్ర వ్యాప్తంగా కూడా నిరసనలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిసిసి అధ్యక్షుడు మహేంద్ర కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఇలా ఉండగా , కేంద్ర బడ్జెట్ పూర్తి నిరాశ కలిగించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ట్వీట్ చేశారు. నీటి పారుదల ప్రాజెక్టులు , వరంగల్ విమానాశ్రయం, కృత్రిమ మేధా కార్యక్రమాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను కేంద్రం పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరమని విక్రమార్క వ్యాఖ్యానించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు, ఎన్డీఏ భాగస్వామ్య రాష్ట్రాలకు మాత్రమే బడ్జెట్ లో న్యాయం చేశారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కేంద్ర జీడిపిలో తెలంగాణ వాటా 5 శాతం ఉన్నప్పటికి ఆ మేరకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. తెలుగుకవి గురజాడ అప్పారావు వ్యాఖ్యలతో బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన కేంద్ర ఆర్థిక మంత్రి తెలుగు రాష్ట్రమైన తెలంగాణకు మాత్రం మొండిచేయి చూపిందని మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కాగా, గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా అమలు చేయాలన్నది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధి ఆలోచన అని , దానిని కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టి బడ్జెట్ లో ప్రకటించిందని విమర్శిస్తూ కాంగ్రెస్ వాల్ పోస్టర్ రిలీజ్ చేసింది.

డెస్క్

**కిషన్ రెడ్డి**

కేంద్ర బడ్జెట్ లో వివిధ పథకాలకు     కేటాయింపుల వల్ల తెలంగాణకు కూడా ప్రయోజనం చేకూరుతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఎంఎస్ఎంఈలకు వచ్చే ఐదేళ్లలో అందించే లక్షన్నర కోట్ల రూపాయల రుణంలో  తెలంగాణ లోని 10 లక్షలకు పైగా ఎంఎస్ఎంఈ లకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన చెప్పారు. 10 వేల కోట్లతో ఏర్పాటు చేసే స్టార్టప్ ఫండ్ వల్ల తెలంగాణ స్టార్టప్ లు వృద్ధి చెందుతాయని, 10 వేల కోట్ల రూపాయల. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ నుంచి హైదరాబాద్ వంటి నగరాలకు నిధులు వస్తాయని కిషన్ రెడ్డి తెలిపారు. అమృత్ పథకం కేటాయింపులను  6 వేల కోట్ల నుంచి రూ. 10 వేల కోట్లకు పెంచడం ద్వారా తెలంగాణలోని 125కు పైగా పట్టణ స్థానిక సంస్థలకు లబ్ధి చేకూరుతుందని, వీధి వ్యాపారులకు 30 వేల విలువైన క్రెడిట్ కార్డులు అందించడం వల్ల తెలంగాణలోని సుమారు ఏడున్నర లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

(DESK)

**<u>బడ్జెట్ ఖమ్మం</u>**

కేంద్ర బడ్జెట్ పై ఖమ్మం జిల్లాకు చెందిన వివిధ వర్గాలకు చెందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఖమ్మంకు చెందిన రాజకీయ విశ్లేషకుడు జి. విద్యాసాగర్ ఆకాశవాణితో మాట్లాడుతూ...

<u>బైట్</u>

పిటిసి, ఖమ్మం

**<u>రహస్య మీటింగ్</u>**

పది మంది ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశమయ్యారనే ప్రచారం అవాస్తమని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి తెలిపారు. జడ్చర్ల శాసనసభ్యుడు అ నిరుధ్ రెడ్డి ఇచ్చిన విందుకు 8 మంది వెళ్లారని , వారందరూ రేవంత్ రెడ్డి నాయకత్వం పట్ల

సంతోషంతో ఉన్నారని మల్లు రవి స్పష్టం చేశారు. దీనిపై బీఆర్ఎస్ సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలను కోరారు.

పిటిసి నాగర్ కర్నూల్

**నిర్మల్ బైట్**

నిర్మల్ జిల్లాలో సుకన్య సమృద్ధి పథకానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉందని నిర్మల్ కు చెందిన అంకం మహేష్ ఆకాశవాణితో అన్నారు.

**బైట్ ... అంకం మహేష్**

పిటిసి, నిర్మల్

**ఇంటర్ ప్రాక్టికల్**

తెలంగాణలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభమవుతాయి. రేపటి నుంచి ఈనెల 22 వరకు జరగనున్న ప్రాక్టికల్ పరీక్షలకు నాలుగు లక్షల 29 వేల మంది విద్యార్థులు హాజరు అవుతున్నారు. రెండు వేలకు పైగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్ టికెట్లను కాలేజీ లాగిన్లతో పాటు విద్యార్థుల ఫోన్లకు పంపినట్టు అధికారులు తెలిపారు. రెండు సెషన్లలోఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. కాలేజీల్లో CCTV కెమెరాల ఏర్పాటుకు యాజమాన్యాలు అంగీకరించాయని బోర్డు అధికారులు తెలిపారు.

(DESK)

**ఆపరేషన్ స్మైల్**

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ స్మైల్ 11వ విడతలో భాగంగా నల్లగొండ జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం ఆధ్వర్యంలో 99 మంది బాలలను గుర్తించి, వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చామని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. జనవరి 1వ తేది నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని 3 సబ్ డివిజన్ కేంద్రాల్లో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 88 మంది మగ పిల్లలు , 11 మంది బాలికలకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. జగిత్యాల జిల్లాలో ఆపరేషన్ స్మైల్ 11వ విడతలో 30 మంది బాల కార్మికులను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరచినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో 57 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించినట్లు జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో 54 మంది బాలురు , ముగ్గురు బాలికలు ఉన్నారని తెలిపారు. చిన్న పిల్లలను ప్రమాదకరమైన ప్రదేశాల్లో పనిలో పెట్టుకున్న యజమానులపై కేసు నమోదు చేసి బాల బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఆయన చెప్పారు.

(PTC-NLG/JGL/ASFB)

**<u>వసంత పంచమి</u>**

వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఈరోజు సరస్వతీ ఆలయాల్లో విశేష పూజలు , పిల్లలకు అక్షరభ్యాసాలు నిర్వహిస్తున్నారు. నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ దేవి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పిలల్లకు అక్షరాభ్యాసాలు చేయించారు. వేములవాడ , తిప్పాపూర్ లోని సరస్వతీ ఆలయంలో కూడా వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వర్గల్ సరస్వతీ ఆలయం కూడా భక్తులతో కిటకిటలాడుతోంది.

డెస్క్/పిటిసిలు

**<u>ప్రత్తి</u>**

ఆసిఫాబాద్ జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో పత్తి నిల్వలు , పత్తి గింజల నిల్వలు అధికంగా ఉన్నందున ఆసిఫాబాద్, వాంకిడి, జైనూర్ జిన్నింగ్ మిల్లులలో ఈనెల 3 , 4 తేదిలలో సిసిఐ పత్తి కోనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ తెలిపారు. అలాగే రెబ్బెన మండలం కొండపల్లి , సిర్పూర్, కౌటాల జిన్నింగ్ మిల్లులలో రేపటి నుంచి 5వ తేది వరకు పత్తి కోనుగోళ్లు ఉండవని ఆయన తెలిపారు.

పిటిసి, ఆసిఫాబాద్

**గడువు పొడగింపు**

రాష్ట్ర దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ దివ్యాంగుల ఆర్థిక పునరావాసం కోసం చేపట్టిన పథకం గడువును ఈనెల 12 వరకు పొడిగించారు. 21 నుండి 55 సంవత్సరాల వయసు కలిగి, 40% పైన వైకల్యం కలిగిన దివ్యాంగులందరూ tgobmms.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని వివిధ జిల్లా సంక్షేమ అధికారులు సూచించారు.

(DESK)

**ఉష్ణోగ్రతలు**

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈనెల ప్రారంభం నుంచే చలి తీవ్రత తగ్గి.. ఎండలు క్రమేపీ పెరుగుతున్నాయి. నిన్న ఆదిలాబాద్ లో సాధారణం కన్నా 5.8 డిగ్రీలు అధికంగా 36.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. గత పదేళ్ల లోనే ఇక్కడ అత్యధిక ఉష్ణోగ్రత 2021 ఫిబ్రవరి 25న 34.5 డిగ్రీలు నమోదయింది. ఖమ్మంలో కూడా సాధారణం కన్నా 3.3 డిగ్రీలు, హైదరాబాద్ లో సాధారణం కన్నా 3.6 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

(DESK)

**<u>విద్యుత్</u>**

తెలంగాణాలో ఇంకా చలికాలం ఉండగానే విద్యుత్ డిమాండ్ రికార్డుస్థాయికి చేరింది. జనవరి 31న ఏకంగా 15,205 మెగావాట్లుగా నమోదైంది. ఇది గత ఏడాది ఇదే రోజున 13 వేల మెగావాట్లుగా ఉంది. ఇక వేసవిలో కరెంట్ డిమాండ్ 17 వేల మెగావాట్లకు చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. డిమాండ్ నేపథ్యంలో అధిక ఉత్పత్తికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇలా ఉండగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ 1912 నంబర్ ద్వారా తక్షణ సేవలను పొందాలని అధికారులు సూచించారు.

(DESK)